సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 18 । జూలై । 2025



కేంద్రం వాటా కోసం తంటాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా లబ్ధిదారుల వివరాలను అధికారులు మరోసారి సేకరిస్తున్నారు.

- 8లో ▸



నీటిని ఎత్తిపోసేదెలా?

ఎస్సారెస్పీలో నిర్మించిన లక్ష్మి ఎత్తిపోతల పథకం సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు నెల రోజుల క్రితం చోరీకి గురయ్యాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.0 /25.1

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'డిగ్రీ' ఫలితాలు విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. రెండవ సెమిస్టర్‌లో 27 శాతం, నాలుగవ సెమిస్టర్‌లో 38 శాతం, ఆరవ సెమిస్టర్‌లో 44 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెయూ కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఆర్మూర్‌కు 29వ ర్యాంకు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షన్ 2024–25లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం తెలిపారు. రాష్ట్రంలోని 143 మున్సిపాలిటీలలో సర్వే నిర్వహించగా ఆర్మూర్ మున్సిపాలిటీకి 29వ ర్యాంకు, అలాగే జాతీయస్థాయి స్మాల్ సిటీ కెటగిరీలో 1585 మున్సిపాలిటీలలో ఆర్మూర్ 318వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో ఆర్మూర్ మున్సిపాలిటీ ఉందన్నారు.

10 శాతం భూముల జోలికి వెళ్లొద్దు

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



ఆర్మూర్: గత ప్రభుత్వంలో అధికారం చెలాయించుకొని అక్రమాలకు పాల్పడిన నాయకులే ఇప్పుడు కండువాలు మార్చి అధికార పార్టీలో కొనసాగుతూ భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. ఇలాంటి నాయకులను నమ్మి లేఅవుట్లలో టెన్ పర్సెంట్ భూముల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు కట్టపై కొనసాగుతున్న మినీ ట్యాంక్ బండ్ పనులు, మామిడిపల్లి, పెర్కిట్ శివార్లలోని టెన్ పర్సంట్ భూములను గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు కట్టిన పన్నులతోనే అభివృద్ధి పనులు కొనసాగుతాయన్నారు. నిధులు ఏ ఒక్క పార్టీకి చెందినవి కావన్నారు. రూ.47 కోట్ల నిధులతో ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణాభివృద్ధి కోసం త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తానన్నారు. ఆయన వెంట ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్, ఆర్డీవో అధికారులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

స్థానిక వేడి.. రాజకీయ రగడ

- వేల్పూర్‌లో ఉద్రిక్త వాతావరణానికి పునాది వేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు
- బాల్కొండ నియోజకవర్గంలో దూకుడు ప్రదర్శించిన ఇరుపార్టీలు
- ఫ్యాక్షన్ మాదిరిగా రాజకీయాలు చేసే ప్రయత్నాలంటూ పరస్పర విమర్శలు
- పోలీసుల పకడ్బందీ చర్యలతో రగడకు విరామం
- మరోసారి పరస్పర విమర్శలు చేసుకున్న మానాల, వేముల



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటి నుంచి ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



వేల్పూర్ మండలంలో గాంధీ విగ్రహం వద్దకు ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : స్థానిక ఎన్నికల వాతావరణం సమీపిస్తున్న నేపథ్యంలో పసుపు నేలగా వెలుగొందుతున్న బాల్కొండ నియోజకవర్గంలో సై అంటే సై అంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఢీకొట్టుకుంటున్నాయి. ఎవరికివారు తగ్గేదే లేదంటూ మాటల మంటలతో చెలరేగుతుండడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నేతలు నిప్పులు చెరిగేలా మాటలు మాట్లాడుతుండడంతో ఇరు పార్టీల శ్రేణులు మాత్రం చేతల వరకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో గురువారం బాల్కొండ నియోజకవర్గంలో వేల్పూర్ కేంద్రంగా ఇరుపార్టీల కార్యకర్తలు చేపట్టిన కార్యక్రమాలు కాక పుట్టించాయి. పోటాపోటీ ప్రకటనలు, చర్యలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రెండు పార్టీల సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులను గమనించిన పోలీసులు ఒకరోజు ముందు నుంచే పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిల వ్యాఖ్యల నేపథ్యంలో ఉద్రిక్తతలు నెలకొనడంతో ఇరు పార్టీల ద్వితీయ శ్రేణులు వేల్పూర్ మండల కేంద్రంలో గుమిగూడొద్దని, 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలు చేస్తూ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని నిజామాబాద్‌లోనే తన ఇంట్లో పోలీసులు కట్టడి చేశారు. ఈ క్రమంలో నిజామాబాద్‌లోనూ కొద్దిసేపు అలజడి వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని మోర్తాడ్‌లో గృహనిర్బంధం చేశారు. పోలీసుల పకడ్బందీ చర్యలతో రాజకీయ రగడకు ప్రస్తుతానికి విరామం ఇచ్చినట్లైంది.



నగరంలో మానాల మోహన్‌రెడ్డిని ఇంటినుంచి బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఇతర నియోజకవర్గాలకు..

బాల్కొండ నియోజకవర్గంలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఉన్న ఏకైక ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాత్రమే కావడంతో జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలన్నీ ప్రశాంత్‌రెడ్డి మాత్రమే నిర్వహిస్తున్నారు. గతంలో మంత్రి జూపల్లి కృష్ణారావు భీంగల్‌లో పర్యటించిన సందర్భంలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఘర్షణ నెలకొంది. పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. మళ్లీ తాజాగా మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదిలా ఉండగా అలజడి వాతావరణం బాల్కొండ నియోజకవర్గంలో రోజురోజుకూ పెరుగుతోంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న సమయంలో ఈ సెగ ఇతర నియోజకవర్గాలకు సైతం పాకే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మరోసారి మాటల మంటలు..

వేల్పూర్ కేంద్రంగా నెలకొన్న ఉద్రిక్తతల సెగను పోలీసులు చల్లార్చినప్పటికీ నేతల మాటల యుద్ధం మాత్రం మరోసారి సాగింది. రాజకీయాలన్నాక విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, అధికార పార్టీ వైఫల్యాలను ప్రతిపక్షంగా ఎత్తిచూపితే దాడులకు దిగే పరిస్థితి సరికాదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తాజాగా ప్రకటన చేశారు. మానాల మోహన్‌రెడ్డి సవాల్ విసరడంతో పాటు దాడులకు దిగితే ప్రజలకు వచ్చే ప్రయోజనమేమిటని ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. గత పదేళ్లలో మానాల మోహన్‌రెడ్డి కేసీఆర్‌ను, తనను అనరాని మాటలన్నప్పటికీ ఇలాంటి దాడులకు దిగలేదని వేముల వ్యాఖ్యానించారు. మరోవైపు మానాల మోహన్‌రెడ్డి సైతం నిజామాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ఎమ్మెల్యే వేముల, బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతురుణమాఫీ, రైతుభరోసా, సన్నధాన్యం బోనస్, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్న విషయమై చర్చకు పిలిస్తే ప్రశాంత్‌రెడ్డి హైదరాబాద్ పారిపోయారన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడమేమిటన్నారు. మేము అమలు చేస్తున్న పథకాలు, గల్ఫ్ కార్మిక కుటుంబాలకు ఇస్తున్న పరిహారం విషయమై మేము చెప్పేవి అబద్ధమైతే ముక్కు నేలకు రాస్తానని, నిజమైతే ప్రశాంత్‌రెడ్డి ముక్కు నేలకు రాయాలన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుల లాగే ప్రశాంత్‌రెడ్డి తుచ్ఛమైన మాటలు మాట్లాడుతున్నారని మానాల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మళ్లీ మరోసారి మాటల మంటలు రేపడంతో ఉద్రిక్తత చల్లారే పరిస్థితి కనిపించడం లేదు.



ఎమ్మెల్యే ఇంటి వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వేల్పూర్‌లో ఉద్రిక్తత

- బల ప్రదర్శనకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పోటాపోటీ
- పలువురు నాయకులు, కార్యకర్తల అరెస్టు
- 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలు చేస్తూ పోలీసుల భారీ బందోబస్తు



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లిన దేవేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడి

మోర్తాడ్/వేల్పూర్ : 'కనువిప్పు' పేరిట కాంగ్రెస్, పరిచయం పేరిట బీఆర్ఎస్ పార్టీలు గురువారం చేపట్టిన కార్యక్రమాలు వేల్పూర్‌లో ఉద్రిక్తతకు దారి తీశాయి. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు బల ప్రదర్శనకు సిద్ధం కావడంతో పోలీసులు 163 బీఎన్ఎస్ఎస్ యాక్టు అమలు చేస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గల్ఫ్ వలస కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను ప్రశాంత్‌రెడ్డికి ఇంటికి తీసుకువస్తామని ప్రకటించారు. మానాల ప్రకటనకు స్పందించిన బీఆర్ఎస్ నాయకులు లబ్ధి పొందని వారితో వేల్పూర్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతామని వెల్లడించారు. ప్రశాంత్‌రెడ్డి నివాసంలో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు రేగుళ్ల రాములు, మరో నాయకుడు పోలీసుల కళ్లుగప్పి గాంధీ విగ్రహం వద్దకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతలోనే పోలీసులు వచ్చి వారిని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వచ్చారు. పోలీసులు వారిని నిలువరించి స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యే ఇంట్లోకి వెళ్లిన నంగి దేవేందర్‌రెడ్డి..

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంటివైపు కాంగ్రెస్ నాయకులెవరూ వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి ఒక్కరే పోలీసుల కళ్లుగప్పి ఎమ్మెల్యే ఇంట్లోకి వెళ్లారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డిని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చారు. కొందరు నాయకులు ఆయనపై దాడి చేసి చొక్కా చింపారు. పోలీసులు కలుగజేసుకొని ఆయన్ని స్టేషన్‌కు తరలించారు.

నాయకులను బయటకు పంపిన పోలీసులు


వేల్పూర్‌లో బల ప్రదర్శన కోసం వచ్చిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు బయటకు పంపించారు. వేల్పూర్‌లో ఉంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



లబ్ధి పొందిన గల్ఫ్ మృతుల కుటుంబాలతో కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి

ఇంటి మీదికి పోవడం సభ్యతా?

- బాల్కొండ ప్రజలు ఆలోచించాలి
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజం. కానీ, వేల్పూర్ మండల కేంద్రంలో నా ఇంటిమీదికి కొందరు కాంగ్రెస్ నాయకులు వచ్చి దాడి చేయడం సభ్యతనా? అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. మానాల మోహన్‌రెడ్డి ఐడెంటిటీ కోసం నా ఇంటి మీదికి దాడికి వస్తే ప్రజలకు జరిగే లాభం ఏమిటని ప్రశ్నించారు. గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి కొందరికి ఇచ్చారు, ఇంకా రానివారు నియోజకవర్గంలో ఉన్నారు. వారికి ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడిగానని స్పష్టం చేశారు. ఒక ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజల పక్షాన అడగడం నా బాధ్యత అని, ఇందులో తప్పేముందని పేర్కొన్నారు. మీరు మా ఇంటికి దాడికి రావడమో, మావాళ్లు మీ ఇంటికి రావడమో, రాజకీయ సన్యాసం తీసుకోవడం లాంటివి టైంపాస్ డ్రామా కార్యక్రమాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన నిలదీసే హక్కు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తనకు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రశాంత్‌రెడ్డి.. దమ్ముంటే చర్చకు రావాలి

- సవాల్ విసిరితే పట్నంలో దాక్కున్నాడు
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై నిత్యం అసత్య ప్రచారాలు చేస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కనువిప్పు కలిగిస్తామంటే హైదరాబాద్‌లో దాక్కున్నాడని, వేల్పూర్ రాకుండా పారిపోయాడని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులకు అధికారం కోల్పోయిన తర్వాత సోయి తప్పిందని, కేటీఆర్, హరీశ్ రావుతోపాటు ప్రశాంత్‌రెడ్డి కూడా మతి తప్పి మాట్లాడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అవమానిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శాంతియుతంగా జరిపే కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు తనను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నారై సెల్ ఏర్పాటు చేసి 55 మందికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల పరిహారం అందించామని, కేవలం బాల్కొండ నియోజకవర్గంలోనే 18 మందికి పరిహారం ఇప్పించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు కేతావత్ యాదగిరి, బోర్గం శ్రీనివాస్, గడుగు రోహిత్, వేణురాజ్, పంచరెడ్డి చరణ్, ప్రీతం పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపిన మాజీ మంత్రి

- రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



హైదరాబాద్‌లో అన్వేష్ రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు


వేల్పూర్: ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనే దురాశతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపారని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇంటికి వెళ్లారన్నారు. కానీ, ప్రశాంత్‌రెడ్డి అనుచరులు రౌడీల్లా ఆయనపై దాడికి తెగబడడం అత్యంత దారుణమన్నారు. గల్ఫ్ బాధితులను ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందో వివరించే కార్యక్రమాన్ని తాము తీసుకుంటే, ముందస్తుగానే రౌడీలను ఇంట్లో పెట్టుకొని దేవేందర్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రజలు ఏమాత్రం హర్షించరని పేర్కొన్నారు.

మత్స్యశాఖలో వసూళ్ల పర్వం!

- బైలా పేరిట అందినకాడికి దండుకున్న వైనం
- జిల్లా అధికారితోపాటు ఉద్యోగులపై ఆరోపణలు
- ఇద్దరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లిన మత్స్యకారులు
- రాష్ట్ర శాఖకూ వెళ్లిన ఫిర్యాదులు
- మందలించిన ఉన్నతాధికారులు

■ డొంకేశ్వర్ మండలంలో ఓ గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘానికి బైలా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. వాస్తవానికి బైలా చేయడానికి రూ.500 చలానా కడితే సరిపోతుంది. బైలా కాపీలను బైండింగ్ చేసినందుకు మరో రూ.500 కలిపి మొత్తం రూ.1000 వరకు ఖర్చు అవుతుంది. కానీ, మత్స్యశాఖ అధికారులు సదరు సంఘం వద్ద రూ.10 వేల వరకు వసూలు చేశారు. ఇదే విధానంలో చాలా మత్స్య సంఘాల వద్ద వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా మత్స్యశాఖలో వసూళ్ల పర్వం నడుస్తోంది. చేయి తడపనిదే ఏ పనీ జరగడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. బైలా లేని మత్స్య సహకార సంఘాల నుంచి అందినకాడికి దండుకున్నారని ప్రచారం జరుగుతోంది. జిల్లా అధికారితోపాటు శాఖలోని కొందరు ఉద్యోగులపై తీవ్ర ఆరోపణలు రాగా, ఇటీవల జిల్లాలోని ఓ ఇద్దరు ఎమ్మెల్యేలకు మత్స్య సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర శాఖకు సైతం ఫిర్యాదులు వెళ్లడంతో అక్కడి ఉన్నతాధికారులు జిల్లా అధికారితోపాటు ఉద్యోగులను మందలించినట్లు తెలిసింది. జిల్లాలో 350కిపైగా మత్స్య సహకార సంఘాలున్నాయి. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు మత్స్యశాఖ పని చేస్తోంది. కానీ, పథకాలు అందాలన్నా.. ఇతర పనులు జరగాలన్నా..చివరికి కొత్త సంఘాలు ఏర్పాటు కావాలన్నా.. ముడుపులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ 'ఎస్ఎఫ్‌డీబీ' పథకం కింద పలు మత్స్యకార సంఘాలు ఇటీవల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. రుణాలు పొందాలంటే మత్స్య సొసైటీలకు బైలా కచ్చితంగా ఉండాలి. బైలా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. కానీ, నిబంధనలు సాకుగా చూపెట్టి ఒక్కో సొసైటీ నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు తీసుకున్నట్లు మత్స్యకారులు బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు. దాదాపు 50 సంఘాలకు బైలా చేసిచ్చారు. వసూలైన డబ్బులను డిపార్ట్‌మెంట్‌లో వాటాలుగా పంచుకున్నట్లు తెలిసింది. అలాగే ఇటీవల కొత్తగా మత్స్యకార సంఘాలను ఏర్పాటు చేయగా వారి నుంచి డబ్బులు రూ.వేలల్లో దండుకున్నట్లు సమాచారం. ఇందులో మహిళా సొసైటీలు సైతం బాధితులుగా ఉన్నారు. మరోవైపు చెరువులకు తహసీల్ కట్టించుకునే విషయంలో సైతం అడ్డగోలుగా డబ్బులు తీసుకున్నట్లుగా కొందరు మత్స్యకారులు చెప్తున్నారు. మత్స్య శాఖలో జరుగుతున్న వసూళ్ల బాగోతంపై ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు జిల్లా అధికారిపై మండిపడినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్‌తోపాటు మొన్నటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన రాజీవ్‌గాంధీ హనుమంతు కూడా ఈ విషయమై ఆరా తీశారు. తమకు జిల్లా అధికారి వద్దని, అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘాల నాయకులు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులను కోరారు. దీంతో సదరు ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.



ఉద్యోగులపైనే ఆరోపణలు వచ్చాయి

శాఖలోని కొందరు ఉద్యోగులు మత్స్య సహకార సంఘాల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. వారిని నెల క్రితమే మందలించాను. ఇందులో నాకు కూడా భాగముందని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. బైలా చేయాలంటే సొసైటీలు రూ.500 ఇస్తే సరిపోతుంది.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి

ప్రశాంత్‌రెడ్డి పతనం మొదలైంది

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి

మోర్తాడ్/వేల్పూర్: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పతనం మొదలైందని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి అన్నారు. పదవులు ఎప్పటికీ శాశ్వతం కావని ఆయన చెప్పారు. గురువారం వేల్పూర్ పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరులతో దేవేందర్‌రెడ్డి మాట్లాడారు. గల్ఫ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సంక్షేమం అమలు చేస్తుందో వివరించడానికి తాను ఎమ్మెల్యే ఇంటికి వెళ్తే అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులను ఉసిగొలిపి దాడి చేయించారని ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రవాసీ ప్రజావాణి నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో 55 మంది కుటుంబాలకు పరిహారం అందించినట్లు గుర్తు చేశారు. వేల్పూర్‌లో జరిగిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి వివరిస్తానని చెప్పారు.

దేవేందర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

వేల్పూర్: వేల్పూర్‌లోని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి అక్రమంగా చొరబడి దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ టీపీసీసీ ఎన్నారై కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేల్పూర్‌లో 163 బీఎన్ఎస్ఎస్ నిషేధాజ్ఞలు అమలులో ఉండగా, వాటిని ధిక్కరించి ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడిన దేవేందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేల్పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, పిట్ల సత్యం, భోజన్న యాదవ్, సుంకరి రాము పాల్గొన్నారు.

30 మందిపై కేసులు నమోదు

వేల్పూర్: వేల్పూర్‌లో పోలీసు నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సుమారు 30 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. కాగా, గురువారం వేల్పూర్‌లో ఆర్మూర్ డీసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డిల పర్యవేక్షణలో డివిజన్‌లోని పోలీసు అధికారులు, ఏఆర్, ఇతర ప్రత్యేక పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

క్లుప్తంగా

పీఈటీల సేవలు అభినందనీయం



నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ప్రయివేట్ బడుల్లో సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నా పీఈటీ(ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్)లు క్రీడాకారుల అభివృద్ధికి కృషిచేస్తుండటం అభినందనీయమని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి(డీవైఎస్‌వో) పవన్ కుమార్ అన్నారు. డీవైఎస్‌వోగా పవన్ కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం నగరంలోని టీఎన్జీవోస్ భవనంలో జిల్లా ప్రయివేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో క్రీడల అభివృద్ధికి మీ అందరి సహకారం కావాలని కోరారు. ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు నాగమణి, విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, గోపిరెడ్డి, శ్రీనివాస్, కృష్ణంరాజు, పశాంత్, మురళి, మధుబాబు, నాగరాజు, నిఖిల్, వినోద్ తదితరుల పాల్గొన్నారు.

ప్రభంజన్‌కు ఘన నివాళి



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం సామాజిక విప్లవకారుడు, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు, బీసీ పోరాట యోధుడు ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ యాదవ్ సంతాప సభలు నిర్వహించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, మాస్ కమ్యూనికేషన్ విభాగాలు వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభంజన్ చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, సోషల్ సైన్స్ డీన్ ఘంటా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభంజన్ కుమార్ అకాల మరణం బహుజనవాదానికి తీరని లోటని అన్నారు. మాస్ కమ్యూనికేషన్ విభాగంలో మూడు రోజులు సంతాపదినాలుగా ప్రకటించారు. టూటా అధ్యక్షుడు పున్నయ్య, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, ప్రొఫెసర్ కనక య్య, అధ్యాపకులు జమీల్ అహ్మద్, అడికె నాగరాజు, రమణాచారి, సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వరి, రాంబాబు, కిరణ్మయి పాల్గొన్నారు.

నంగి దేవేందర్ రెడ్డికి పరామర్శ



నిజామాబాద్ సిటీ: వేల్పూరులో బీఆర్ఎస్ కార్యకర్తల దాడిలో గాయపడ్డ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కో–కన్వీనర్ నంగి దేవేందర్‌రెడ్డి జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం రాత్రి డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్ ఆస్పత్రికి వచ్చి దేవేందర్ రెడ్డిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని అతడికి భరోసా కల్పించారు. దాడులు చేయడం కాంగ్రెస్ సంస్కృతి కాదని, ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే కాంగ్రెస్ శ్రేణులు చేతులు ముడుచుకొని కూర్చోరన్న విషయం గుర్తుంచుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి సూచించారు.

కేంద్రం వాటా కోసం తంటాలు

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై మరోమారు సర్వే
- పీఎం ఆవాస్ యోజన పథకం నిధుల కోసమేనంటున్న అధికార యంత్రాంగం



బడాభీమ్‌గల్‌లో పీఎంఏవై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మోర్తాడ్(బాల్కొండ): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికైన వారి వివరాలను మరోమారు సేకరించడానికి పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు సర్వేను ముమ్మరం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలంటే మరోమారు సర్వే నిర్వహించాల్సి ఉందని అధికార యంత్రాంగం స్పష్టం చేసింది.

ఈసారి ఆవాస్ ప్లస్ 2024 యాప్‌లో..

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి అంతే మొత్తంలో ఇళ్ల నిర్మాణంకు ఆమోదం తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల సాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కేంద్రం వాటా కూడా ఉండాలంటే ఆ ప్రభుత్వం సూచించిన విధంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహించాలి. గతంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయగా, ఈసారి ఆవాస్ ప్లస్ 2024 యాప్ ద్వారా పీఎంఏవై–జీలో నమోదు చేయాల్సి ఉంది. మూడు రోజులుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వద్దకు వెళ్లి కేంద్రం వాటా కోసం ఉద్యోగులు వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగా వాటా నిధుల కోసం పీఎంఏవై సర్వే తప్పనిసరి అయ్యింది. ప్రతి కార్యదర్శి, వార్డు అధికారి లబ్ధిదారు ఇంటికి వెళ్లి 15 అంశాలపై వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

బ్యాంకుల వివరాల్లో గందరగోళం..

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి డబ్బులు జమ చేయడానికి లబ్ధిదారుల ఖాతాల నంబర్లు గతంలో సేకరించారు. ఏ బ్యాంకు ఖాతా అయినా లబ్ధిదారులకు విడతల వారిగా సొమ్ము జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. పీఎంఏవైకి సంబంధించి కొన్ని బ్యాంకు ఖాతాల నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు చెబుతున్నారు. ఒకటి, రెండు జాతీయ బ్యాంకుల ఖాతాల వివరాలను మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ చేయగలుగుతున్నామని గ్రామీణ, సహకార, ఇతర బ్యాంకుల ఖాతాల నంబర్లు నమోదు చేస్తే సర్వే పూర్తి కావడానికి ఇబ్బంది కలుగుతుందని సిబ్బంది వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ బ్యాంకు ఖాతా అయినా అంగీకరించగా, కేంద్రం మాత్రం కొన్ని జాతీయ బ్యాంకుల ఖాతాల వివరాలనే ఆమోదించడం గమనార్హం. ఈ సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తేనే కేంద్రం వాటా కోసం నిర్దేశించిన సర్వే పూర్తవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

ఎలాంటి ఆటంకం లేకుండా సర్వే

కేంద్రం వాటా రాబట్టుకోవడానికి మరోసారి సర్వే నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ఈ సర్వే కొనసాగుతుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా సర్వే జరుగుతుంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే విడతల వారీగా డబ్బులు జమ చేయడానికి బిల్లులు తయారు చేస్తున్నాం.

– నర్సింహా రావు, డీఈ, గృహ నిర్మాణ సంస్థ

ఘనంగా బోనాల ఉత్సవం





అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అధికారులు, టీజీవో ప్రతినిధులు.. పోతురాజుల విన్యాసం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో గురువారం తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు, అధికారులు బోనాలతో పాత కలెక్టరేట్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని, బోనాలు, సారే సమర్పించారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో టీజీవో ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు అలుక కిషన్ అన్నారు. వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య బోనాలు ఎత్తుకొని పాల్గొన్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. టీజీవో ప్రతినిధులు శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ ఉన్నారు.



పాత కలెక్టరేట్ ఆవరణలోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వనదుర్గామాత



పాత కలెక్టరేట్ వద్ద బోనాలతో వస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యేధన్‌పాల్, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్ తదితరులు

జిట్టపులి దాడిలో లేగదూడ మృతి



లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ: మండలంలోని పాకాల శివారులో జిట్టపులి (లియోపార్డ్) దాడిలో లేగ దూడ మృతి చెందినట్లు అటవీశాఖ అధికారి సాయికిరణ్ తెలిపారు. మృతి చెందిన లేగ దూడ పాకాల గ్రామానికి చెందిన తేజావత్ బాబుకు చెందినదన్నారు. ఉమ్మడి జిల్లా అడవుల్లో పెద్దపులి సంచారం నేపథ్యంలో ఘటన స్థలాన్ని డీఎఫ్‌వో నిఖిత, ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్, యానిమల్ ట్రాకర్స్, రేంజ్ సిబ్బంది సందర్శించారు. లేగ దూడను పెద్దపులి కాదని జిట్ట పులి చంపినట్లు నిర్ధారించారు. లేగ దూడ కళేబరానికి పశు వైద్య శాఖ అసిస్టెంట్ సర్జన్ పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం పాడి రైతుకు అటవీ శాఖ ద్వారా నష్ట పరిహారం చెల్లిస్తామని డీఎఫ్‌వో తెలిపారు. అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న ప్రజలు అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లవద్దని ఆమె సూచించారు. పశువుల కాపరులు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపే అడవిలోకి కొద్ది దూరం మాత్రమే వెళ్లి తిరిగి రావాలన్నారు. పొలాల్లో పనులకు వెళ్లేటప్పుడు గుంపులుగా, పెద్ద శబ్దాలు చేస్తు వెళ్లాలన్నారు. ఎవరైనా ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గాని వన్యప్రాణులకు ప్రాణహాని కలిగించినచో కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మేకల కొట్టంపై చిరుత పులి దాడి



జానకంపేట గ్రామ శివారులో చిరుతపులి ఆనవాళ్లను అన్వేషిస్తున్న అటవీశాఖ అధికారులు

బోధన్: ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో మేకల కొట్టంపై బుధవారం రాత్రి చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీసుకెళ్లింది. వివరాలు ఇలా.. జానకంపేట గ్రామానికి చెందిన వెల్మల సందీప్‌కు గ్రామ శివారులోని నవీపేట–బాసర రైల్వేగేట్ అవతల మేకల కొట్టం ఉంది. ఈ కొట్టంలో అతడు మేకలతోపాటు కొన్ని గేదెలను సంరక్షిస్తున్నాడు. కొట్టంపై బుధవారం రాత్రి చిరుత పులి దాడి చేసి ఒక మేకను తీసుకెళ్లింది. వెంటనే ఈ విషయాన్ని అతడు అటవీశాఖ అధికారులకు తెలిపాడు. గురువారం అటవీశాఖ నవీపేట సెక్షన్ బీట్ ఆఫీసర్ సుధీర్ ఘటన స్థలానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. చిరుత పులిదాడి ఘటన వాస్తవమేనని ధ్రువీకరించారు. ఎడపల్లి మండలం ఠాణాకలాన్ గ్రామ శివారులో మూడు నెలల క్రితం చిరుత పులి సంచరించింది. నవీపేట మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో చిరుత పులుల సంచారం ఉందని జిల్లా అటవీశాఖ అధికారి సంజయ్‌గౌడ్ తెలిపారు. చిరుత సంచారంతో జానకంపేటతో పాటు పోచారం, దూపల్లి గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

నీటిని ఎత్తిపోసేదెలా?

- లక్ష్మి ఎత్తిపోతల పథకం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- నెలరోజులు గడిచినా కొత్తవాటిని ఏర్పాటు చేయని వైనం



లక్ష్మి లిఫ్ట్‌కు చెందిన సబ్‌స్టేషన్‌లో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో 1045 అడుగులు నీటి మట్టం వద్ద నిర్మించిన లక్ష్మి ఎత్తిపోతల పథకం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు నెలరోజుల క్రితం చోరీకి గురయ్యాయి. గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. అయినా ఇప్పటికీ వాటి స్థానంలో కొత్త వాటిని అధికారులు ఏర్పాటు చేయలేదు.

నీటి విడుదలకు డిమాండ్..

లక్ష్మి హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రాజెక్ట్ నీటి మట్టం 1064 వరకే సరఫరా జరుగుతుంది. తర్వాత ప్రాజెక్ట్ నుంచి నీటిని లక్ష్మి లిఫ్ట్ ద్వారా లిఫ్ట చేసి కాలువ హెడ్ రెగ్యులేటర్ వరకు సరఫరా చేయాలి. కానీ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లు లేకపోవడంతో విద్యుత్ సరఫరా లేకుండా పోయింది. ప్రస్తుతం వర్షభావ పరిస్థితుల వలన ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదలకు డిమాండ్ పెరుగుతుంది. ఈనేపథ్యంలో నీటి విడుదలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్మి లిఫ్టను నిర్మాణం చేపట్టిన కంపెనీ ఇప్పటికీ ప్రాజెక్ట్ అధికారులకు అప్పగించలేదు. దీంతో ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లను బిగించే బాధ్యత కంపెనీ వారే చూసుకోవాలి. రికవరీ కోసం అధికారులు కంపెనీ ప్రతినిధులకు లేఖలు రాశారు. కానీ ఇంకా అమలులోకి రావడం లేదు. ప్రాజెక్ట్ అధికారులు ఆ లిఫ్టను మైనర్ ఇరిగేషన్ బాల్కొండకు అప్పగించారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు బిగించేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వెంటనే బిగించాలి..



లక్ష్మి లిఫ్ట్ సబ్‌స్టేషన్‌లో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో వెంటనే కొత్త వాటిని బిగించాలి. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో నారు మడులు ఎండిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, నీటి విడుదల చేపడితే నారు మడులను కాపాడుకుంటాం.

– గంగారెడ్డి, ఆయకట్టు రైతు, ముప్కాల్

త్వరలోనే బిగిస్తారు..

సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ విషయాన్ని నిర్మించిన కంపెనీకి తెలియజేశాం. అంతేకాకుండ రికవరీ కోసం లెటర్ పెట్టాం. కంపెనీ వారు త్వరలోనే బిగిస్తామని తెలిపారు. లేదా ఓఅండ్ఎం నిధుల నుంచైన పనులు చేపిస్తాం.

– ప్రవీణ్‌రెడ్డి, ఏఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ.

రుణాల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని వివిధ రకాల దివ్యాంగులకు స్వయం ఉపాధి నిమిత్తం 2025–26 ఆర్థిక సంవత్సరమునకు గాను రాష్ట్ర ప్రభుత్వము దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. 21ఏళ్ల నుంచి 55ఏళ్ల మధ్య వయస్సు కలిగిన దివ్యాంగులు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 31లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు నగరంలోని జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేదా ఫోన్ నం. 08462–251690ను సంప్రదించాలన్నారు. జిల్లాలో మొత్తం 36 మందికి రుణాలు అందిస్తామని, ఇందులో 33 మందికి రూ. 50వేల లోపు 100శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. మిగిలిన మూడు రుణాలకు ఒక్కొక్కరి చొప్పున అందిస్తామన్నారు.రూ. 1,00,000కు 80శాతం సబ్సిడీ, రూ. 2,00,000లకు 70శాతం సబ్సిడీ, రూ. 3,00,000లకు 60శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు,

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామం వద్ద పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలతోపాటు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడపడంతో వారిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం వారిని బోధన్ అదనపు న్యాయమూర్తి శేషతల్ప సాయి ఎదుట హాజరుపర్చగా, ఒకరికి మూడు రోజులు, మరొకరికి రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్(బోధన్): మండలంలోని పేపర్‌మిల్ శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ గురువారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్‌తోపాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అధిక వేగంతో వెళుతున్న ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

రుద్రూర్: మండల కేంద్రం నుంచి అధిక వేగంతో వెళుతున్న పోతంగల్ మండలానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను గురువారం పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. వీటికి రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. మండలంలో ఇసుక అనుమతి లేకుండా తీసుకెళ్లినా, అతి వేగంతో వెళ్లినా వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

క్రైం కార్నర్

మూర్ఛ వ్యాధితో గుర్తుతెలియని వ్యక్తి మృతి



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కంఠం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మూర్ఛవ్యాధితో మృతి చెందాడు. వివరాలు ఇలా.. గ్రామంలో గురువారం సుమారు 25ఏళ్ల నుంచి 30ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి కత్తెరలు సానబెట్టేందుకు వచ్చాడు. ఇంటింటికీ తిరుగుతూ కత్తెరలు సానబెడుతుండగా అకస్మాత్తుగా మూర్ఛవ్యాధి వచ్చి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మోపాల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గుండ్యానాయక్ తండాకు చెందిన ప్రకాశ్ (40) గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి వచ్చాడు. కొన్నిరోజులుగా అతడి ఇంట్లో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈక్రమంలో ఇటీవల ప్రకాశ్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గురువారం పరిస్థితి విషమించి ప్రకాశ్ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో మహిళ ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారంనగర్ కాలనీలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. కాలనీలో నివాసం ఉండే శశికళ(40) గతంలో గంధం శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ. 15వేలు అప్పు తీసుకుంది. ఇప్పటి వరకు 36వేలు వడ్డీ కట్టినప్పటికీ ఇంకా అసలు ఇవ్వాలని వేధించాడు. దీంతో ఈ బాధ భరించలేక బుధవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

హోటల్ యజమానిపై కేసు నమోదు

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని భీమవరం రుచులు హోటల్ యజమాని విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలకేంద్రంలోని భీమవరం రుచులు హోటల్‌పై బుధవారం ముస్కాన్ టీం ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఆఫీసర్ పల్నాటీ యోహాన్ తనిఖీలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా 15 సంవత్సరాల బాలుడు హోటల్‌లో పని చేస్తునట్లు గుర్తించారు. లేబర్ ఆఫీసర్ యోహాన్ ఫిర్యాదు మేరకు హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు.

వివాహేతర సంబంధం అనుమానంతోనే హత్య

- బిచ్కుందలో మర్డర్ కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ రవికుమార్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో ఊరడమ్మ గల్లిలో అడికే రమేష్‌ను హత్య చేసిన నిందితుడు హుండేవార్ కాశీనాథ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. అడికే రమేష్, హుండేవార్ కాశీనాథ్ ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు అవుతారు. రమేష్ బిచ్కుందలోనే నివాసం ఉంటున్నాడు. కాశీనాథ్ పెద్దదేవాడ గ్రామానికి చెందినవాడు కాగా, ఉపాధి నిమిత్తం భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కొన్ని నెలల క్రితం రమేష్ తన చెల్లితో కలిసి హైదరాబాద్‌లో ఉన్న కాశినాథ్ ఇంటికి వెళ్లి, వారం రోజులు ఉన్నాడు. అప్పటి నుంచి తన భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో రమేష్‌తో అక్రమ సంబంధం ఉన్నట్లు భర్త కాశీనాథ్‌కు అనుమానం వచ్చింది. దీంతో అతడు రమేష్‌పై కక్షగట్టి ఈనెల 15న రాత్రి హైదరాబాద్ నుంచి బిచ్కుంద వచ్చాడు. 16న ఉదయం రమేష్ ఇంటికి వెళ్లగా అతడు తలుపు తీయగానే కత్తితో కాశీనాథ్ విక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పరారీలో ఉన్న కాశీనాథ్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సై మోహన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

రుద్రూర్: కోటగిరి పరిధిలోని ఎత్తోండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సునీల్ గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 24,200 నగదు, 8 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

1962 యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బోధన్‌లో పాడి గేదెలను పరిశీలిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్: పాడి రైతులు 1962 (భారత్ పశుదాన్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవా లని పశుసంవర్ధక శాఖ కేంద్ర కార్యాలయం హైదరాబాద్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ ఎండీ అజారుద్దీన్ అన్నారు.మండలంలోని పలు గ్రామాల్లో గురువా రం ఆయన పర్యటించి, పశుసంవర్ధక శాఖ అధికారులు, గోపాల మిత్ర సభ్యులు అందిస్తున్న సేవల ను పరిశీలించారు. పాడి రైతులతో మాట్లాడి, గోపా ల మిత్ర, పశుసంవర్ధక శాఖ సేవలను ఆరా తీశా రు. పాడి రైతులు ప్రతి ఒక్కరూ 1962 (భారత్ పశుదాన్) యాప్‌లో తమ పశువుల వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూ చించారు. ఈ యాప్ ద్వారా పశువుల లింగనిర్ధారిత, కృతిమ గర్భాధారణ సిమెన్, ప్రభుత్వ వ్యాక్సినేషన్‌లు, పశువుల అమ్మకాలు, కొనుగోలు వంటి సేవలను పొందవచ్చన్నారు. గోపాల మిత్ర సభ్యులు ఆ రీఫ్, ఆజ్మత్, పాడి రైతులు పాల్గొన్నారు.

మండలాలకు ప్రత్యేక అధికారుల నియామకం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో వీరు సంబంధిత పనులు చేయనున్నారు.

అధికారిపేరు	కేటాయించిన మండలం	హోదా
విజయలక్ష్మి	ఆలూరు	ఏడీఏ–ఆర్మూర్
శ్రీనివాస్	ఆర్మూర్	డీసీవో
ఎస్.కె.రసూల్‌బీ	బాల్కొండ	డీడబ్ల్యూవో
డి.శ్రీనివాస్‌రావు	భీమ్‌గల్	డీపీవో
కృష్ణవేణి	బోధన్	జిల్లా మైనార్టీ శాఖ అధికారి
విజయ్‌కుమార్‌రాథోడ్	చందూర్	ఏడీ మైన్స్
ఎం.శ్రీనివాస్	ధర్పల్లి	డీఎల్‌పీవో–నిజామాబాద్
పి.యోహన్	డిచ్‌పల్లి	జిల్లా కార్మికశాఖ అధికారి
ఎం.కృష్ణ	డొంకేశ్వర్	ఏడీఏ–నిజామాబాద్
వీరస్వామి	ఇందల్వాయి	ఏడీఏ–నిజామాబాద్
కె.ప్రవీణ్	జక్రాన్‌పల్లి	డీడీ–అగ్రికల్చరల్
సాయగౌడ్	కమ్మర్‌పల్లి	డీఆర్‌డీవో–నిజామాబాద్
ఎం.ఎ.అలీంహైమద్	కోటగిరి	ఏడీఏ–బోధన్
ఆంజనేయస్వామి	మెండోరా	జిల్లా మత్స్యశాఖ ఏడీ
బి.శ్రీనివాస్	మోర్తాడ్	ఏడీ–ఉద్యానవనశాఖ
డి.రమేశ్	మోస్రా	ఎస్సీ కార్పొరేషన్ ఈడీ
జె.గోవిందరావు	మోపాల్	వయోజన విద్య డీడీ
స్రవంతి	ముప్కాల్	బీసీ సంక్షేమ అధికారిణి
వి.జగన్నాథచారి	నందిపేట	డీపీఏహెచ్–నిజామాబాద్
రతన్	నవీపేట	సీపీవో–ఏడీ
రాజేందర్	నిజామాబాద్	మెప్మా పీడీ
రోహిత్‌రెడ్డి	పోతంగల్	ఏడీ –బోధన్
నాగరాజు	రెంజల్	డీఎల్‌పీవో –బోధన్
అశోక్	రుద్రూర్	ఏడీ ఎస్ఎల్ఆర్–నిజామాబాద్
సురేష్‌కుమార్	సాలూరా	జీఎం–డీఐసీ–నిజామాబాద్
నాగోరావు	సిరికొండ	జిల్లా గిరిజనసంక్షేమాధికారి
భారతి	వేల్పూర్	ఏడీ ఉద్యానవనశాఖ
టి.మధుసూదన్	వర్ని	ఏపీడీ డీఆర్‌డీవో
రవికుమార్	ఎడపల్లి	జిల్లా ఇంటర్ విద్యాధికారి
ఏ.శివకృష్ణ	ఏర్గట్ల	డీఎల్‌పీవో–ఆర్మూర్